సాక్షి
వరంగల్

బుధవారం । 19 । ఫిబ్రవరి । 2025



ఆకుకూరలతో అధిక ఆదాయం

వేసవిలో ఆకుకూరల సాగుతో అధిక ఆదాయం పొందవచ్చని మల్యాల కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త రాంబాబు తెలిపారు.

- 8లో ▸



స్వచ్ఛమైన పెట్రోల్ అందిస్తాం

జైళ్ల శాఖ ద్వారా స్వచ్ఛమైన పెట్రోల్, డీజిల్ అందిస్తామని రాష్ట్ర జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా తెలిపారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
34.0° /19.0°

వాతావరణం

జిల్లాలో ఉదయం సాధారణంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రతతో ఉక్కపోత ఉంటుంది. రాత్రి కాస్త చల్లటి వాతావరణం ఉంటుంది.

వరంగల్ టు మహారాష్ట్ర!

హుజూరాబాద్ మీదుగా సరిహద్దులు దాటుతున్న పీడీఎస్ రైస్

- ప్రధాన కేంద్రాలు హనుమకొండ, హసన్‌పర్తి, పరకాల శివార్లు
- ఈ దందా వెనుక భీమదేవరపల్లి మండల వాసి!
- పీడీ యాక్టు, 6ఏ కేసులు, అరెస్టులకు వెరవని మాఫియా
- అక్రమార్కులకు వరంగా మారినఉచిత బియ్యం పథకం



సాక్షిప్రతినిధి, వరంగల్:

- వరంగల్ జిల్లా చెన్నారావుపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాత మగ్దుంపురం గ్రామంలో సోమవారం రూ.2.50 లక్షల విలువ చేసే 100 క్వింటాళ్ల బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ముగ్దుంపురం గ్రామానికి చెందిన ననుమాస కిరణ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు.

- కేయూసీ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ నెల 15న రూ.82,500 విలువ చేసే 33 క్వింటాళ్లు, 16న కాజీపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో రూ.32,500 విలువైన 13 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నారు.బత్తుల దుర్గమ్మ,గంట సారయ్య, తూర్పాటి కుమార్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు.

- హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలోని దేవన్నపేట శివారులో ఈ నెల 14న ఓ రైస్‌మిల్లులో అక్రమంగా నిల్వచేసిన రూ.8.06 లక్షల విలువైన 310 క్వింటాళ్ల రేషన్ బియ్యం, ఓ లారీ, బైక్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రైస్‌మిల్లు లీజుదారుడు కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం బోర్నపల్లికి చెందిన కేశబోయిన మొగిలిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

.. ఇలా ఉమ్మడి వరంగల్ జిల్లాలో వారం రోజుల వ్యవధిలో 1,024 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 560 క్వింటాళ్లకు పైగా పీడీఎస్ రైస్‌ను స్వాధీనం చేసుకోవడం గమనార్హం. రోజుకు వందల క్వింటాళ్ల రేషన్ బియ్యం వయా హుజూరాబాద్, కాళేశ్వరం ద్వారా మహారాష్ట్రకు అక్రమంగా తరలుతున్నాయి. మామూలు తనిఖీల్లోనే ఇంత పెద్దమొత్తంలో రేషన్ బియ్యం పట్టుబడ్డాయంటే 'రేషన్' దందా ఏ స్థాయిలో జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు. వరంగల్, హనుమకొండ, పరకాల, జనగామ, నర్సంపేట, ములుగు, భూపాలపల్లి తదితర ప్రాంతాల నుంచి సాగుతున్న రేషన్ బియ్యం దందా ఎల్లలు దాటుతోంది. వరంగల్ ఈ దందా వెనుక కొందరు రైస్‌మిల్లర్లే కీలకం కాగా.. భీమదేవరపల్లి మండలానికి చెందిన ఒకరు హసన్‌పర్తికి మకాం మార్చి 'మేనేజ్' చేస్తూ 'కోటి'కి పడగెత్తినట్లు ప్రచారం జరుగుతోంది. ఇతడికి సంబంధించిన రేషన్ బియ్యం వందల క్వింటాళ్లు పోలీసులకు దొరుకుతున్నా.. ఎఫ్ఐఆర్ నమోదైనా.. ఆ సమయంలో 'పరారీ'లోనే ఉంటాడు. పరిస్థితి సద్దుమణిగిన తర్వాత తాపీగా పోలీసులకు చిక్కే ఆ వ్యక్తికి అన్ని వర్గాల మద్దతు ఉందన్న చర్చ ఉంది.

ఉమ్మడి వరంగల్ జిల్లా సమాచారం	
ఉమ్మడి జిల్లాలో మొత్తం కార్డులు (ఆహార భద్రత+అంత్యోదయ+అన్నపూర్ణ)	: 11,05,543
మొత్తం యూనిట్లు (కుటుంబ సభ్యులు)	: 32,55,776
మండలస్థాయి స్టాక్ పాయింట్లు	: 18
మొత్తం రేషన్ దుకాణాలు	: 2,364
ప్రతినెల రేషన్ బియ్యం పంపిణీ	: 33,153.976 మెట్రిక్ టన్నులు

కమిషనరేట్ పరిధిలో ప్రధాన కేంద్రాలు..

- పలు పట్టణ, జిల్లా కేంద్రాలు అడ్డాగా బియ్యం దందా సాగుతోంది. ఇటీవల రేషన్ బియ్యం అక్రమ రవాణాకు హసన్‌పర్తి, హనుమకొండ, పరకాల, నర్సంపేట ప్రధాన కేంద్రాలుగా మారాయి.
- తరచూ పీడీఎస్ బియ్యం పట్టుబడుతున్నా హనుమకొండ, హసన్‌పర్తి, ఎల్కతుర్తి, కమలాపూర్ మండలాలకు సంబంధించిన బియ్యం పరకాల కేంద్రంగా మార్పిడి, రవాణా ఆగడం లేదు. ఈ బియ్యం దందా వెనుక గతంలో హనుమకొండలో గుట్కా, బెల్లం దందాతో సంబంధం ఉన్న ఒకరు బ్యాచ్‌తో 'శివ'మెత్తుతున్నట్లు ఇటీవల నమోదైన కేసుల ద్వారా స్పష్టమవుతోంది.
- గూడూరు, ఖానాపురం, కొత్తగూడ, చెన్నారావుపేట తదితర ప్రాంతాల నుంచి సేకరిస్తున్న రేషన్ బియ్యం నర్సంపేట కేంద్రంగా పాలిష్ చేసి సంచుల మార్పిడి, అక్రమ రవాణాకు పాల్పడుతున్నట్లు సమాచారం. ఇక్కడి నుంచి తరలిస్తున్న బియ్యంపై ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర సరిహద్దుల్లో గతంలో కేసులు నమోదు అయ్యాయి. ఆ సమయంలో రేషన్ బియ్యం మాఫియా, ఇతరుల మధ్య పెద్ద ఎత్తున గొడవ జరగ్గా.. అప్పటి ఓ ప్రతినిధి జోక్యంతో సద్దుమణిగినట్లు తెలిసింది.
- ఈ దందాలో రూ.లక్షలు గడిస్తున్న బియ్యం వ్యాపారులు మాఫియా డాన్‌లుగా మారుతున్నారు. రేషన్ బియ్యం వ్యాపారులపై పీడీ యాక్టు పెడతామని బెదిరించినా.. 6ఏ కేసులు పెట్టినా ఫలితం ఉండటం లేదు. దీంతో రేషన్ దుకాణాల ద్వారా ప్రభుత్వం సరఫరా చేస్తున్న బియ్యానికి పాలిష్ పెట్టి దారి మళ్లించి రూ.లక్షలు గడిస్తున్నారు. మార్కెట్‌లో ఆ నాణ్యత ఉన్న బియ్యం ధర రూ.35 నుంచి రూ.45 పైగా ధర ఉండడంతో అక్రమార్కులకు ఉచిత బియ్యం పథకం వరంలా మారింది.
- పీడీఎస్ దందాపై ఎక్కడికక్కడ చెక్‌పోస్టుల్లో కట్టడి చేస్తున్నామని, ఇటీవల కాలంలో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా తమ బృందాలు తనిఖీలు ఉధృతం చేశాయని పౌరసరఫరాల శాఖకు చెందిన అధికారి ఒకరు చెప్పారు. పీడీఎస్ బియ్యం దందా చేసే వారిపై ఇకపై మరింత తీవ్రంగా వ్యవహరిస్తామని పోలీసులు కూడా ప్రకటించారు.



చెన్నారావుపేట మండలం పాతమగ్దుంపురలో పట్టుకున్న రేషన్ బియ్యాన్ని చూపిస్తున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు (ఫైల్)

న్యూస్‌రీల్

పరీక్షలకు సన్నద్ధమవ్వాలి



చెన్నారావుపేట: పదో తరగతి పరీక్షలకు విద్యార్థులు పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలని జిల్లా విద్యాశాఖ అకాడమిక్ మానిటరింగ్ అధికారి సుజన్‌తేజ అన్నారు. ఈ మేరకు మండలంలోని ఉప్పరపల్లి హైస్కూల్‌లో మంగళవారం పదో తరగతి విద్యార్థుల నిర్మాణాత్మక మూల్యాంకన రికార్డులను బృందం పరిశీలించింది. విద్యార్థుల సామర్థ్యాల ఆధారంగా తెలుగు, హిందీ, ఆంగ్లం, గణితం, సామాన్య, సాంఘిక శాస్త్రాల్లో ప్రతి సబ్జెక్టుకు 20 మార్కుల చొప్పున నమోదును పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు పలు సూచనలు చేశారు. మార్కులను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని చెప్పారు. ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను కలెక్టర్, జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో సన్మానించనున్నట్లు తెలిపారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పరిశీలన బృందంలో ప్రభాకర్‌రావు, కొండ కృష్ణమూర్తి, నల్లతీగెల యాకయ్య, శ్రీరామ్ సునిత, తదితరులు ఉన్నారు.

ఆలయ అభివృద్ధికి రూ.లక్ష విరాళం



వర్ధన్నపేట: మండలంలోని ఇల్లంద గ్రామంలోని శ్రీకంఠమహేశ్వర ఆలయ అభివృద్ధికి ఖుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద రూ.లక్ష విరాళం అందచేసినట్లు ఇల్లంద గ్రామ గౌడ సంఘం సభ్యులు తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో గ్రామపెద్దలు కస్తూరి బాలరాజు ద్వారా ఎమ్మెల్యే వివేకానంద.. గౌడ సంఘం సభ్యులకు ఈ విరాళం అందచేశారు. కార్యక్రమంలో పోశాల వెంకన్న, సమ్మెట సూరి, సూరి, వేణుకుమార్, యాకయ్య, కవిరాజు, సమ్మయ్య, సాయిలు, నర్సింహులు, తదితరులు పాల్గొన్నారు.

డీటీఆర్‌లు ప్రారంభం

గీసుకొండ: మండలంలోని ఊకల్‌హవేలిలో నాగేంద్ర సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద విద్యుత్ సరఫరా సజావుగా సాగడానికి డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ (డీటీఆర్)ను మంగళవారం ఎన్పీడీసీఎల్ జిల్లా చీఫ్ ఇంజినీర్ రాజుచౌహాన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయనకు అర్చకులు సముద్రాల సుదర్శనాచార్యులు, శ్రీహర్ష ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి పూజలు నిర్వహించారు. అలాగే గొర్రెకుంట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని కట్టమల్లన్న ఆలయం వద్ద కొత్తగా డీటీఆర్‌ను ఏర్పాటు చేసినట్లు ఏఈ దిలీప్ తెలిపారు.


20 నుంచి కేయూ దూరవిద్య సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని దూరవిద్య ఎంఏ, ఎంకాం మొదటి సెమిస్టర్ పరీక్షలు ఈనెల 20 నుంచి నిర్వహించనున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి కె.రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి పద్మజ మంగళవారం తెలిపారు. ఈనెల 20, 22, 24, 27, మార్చి 1తేదీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటలవరకు పరీక్షలు జరుగుతాయని వారు పేర్కొన్నారు.

ఎంఏ జర్నలిజం,హెచ్‌ఆర్‌ఎం పరీక్షలు

కేయూ దూరవిద్య ఎంఏ జర్నలిజం, ఎంఏ హెచ్‌ఆర్‌ఎం మొదటి సెమిస్టర్ పరీక్షలు ఈనెల ఈనెల 20, 22, 24, 27, మార్చి 1, 3వ తేదీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయని అధికారులు తెలిపారు. 1,958 మంది విద్యార్థులకు 11 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వారు పేర్కొన్నారు.

పురాతన కట్టడాలను కాపాడుకోవాలి



హన్మకొండ కల్చరల్: పురాతన దేవాలయాలు, కట్టడాలను కాపాడుకుంటే చరిత్రకు ఆధారాలుగా నిలుస్తాయని జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా పేర్కొన్నారు. హనుమకొండలోని శ్రీరుద్రేశ్వరస్వామి వారి వేయిస్తంభాల దేవాలయాన్ని సౌమ్యమిశ్రా మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ, అర్చకులు ఆమెను ఆలయమర్యాదలతో స్వాగతించారు. స్వామి వారికి బిల్వార్చన, పూజలు చేసిన అనంతరం ఉపేంద్రశర్మ తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలు, మహదాశీర్వచనం అందజేశారు. కార్యక్రమంలో జైళ్ల శాఖ అధికారులు, డీసీపీ దేవేందర్‌రెడ్డి, హనుమకొండ సీఐ సతీశ్ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు శ్రీభద్రకాళి దేవాలయాన్ని సందర్శించి పూజలు చేశారు.

ఆరోగ్య కార్యక్రమాలు విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ సాంబశివరావు

గీసుకొండ: వైద్య, ఆరోగ్య కార్యక్రమాల విషయంలో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ సాంబశివరావు అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో గీసుకొండ, రాయపర్తి(డబ్బ్యా) పీహెచ్‌సీల వైద్యాధికారులు, సూపర్‌వైజర్లు, సిబ్బందితో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. మాతాశిశు సంరక్షణ, వాక్సినేషన్, సాధారణ ప్రసవాలు, టీబీ నియంత్రణ, సంక్రమిత, అసంక్రమిత వ్యాధుల సర్వే, వైద్యసేవలు తదితర విషయాల్లో వెనకబడిన ఆరోగ్య ఉప కేంద్రాల సిబ్బందిని ఆయన సరిగా పని చేయాలంటూ హెచ్చరించారు. ప్రతీ ఉద్యోగి సమయపాలనను పాటించాలన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ, డీఐఓ డాక్టర్ ప్రకాశ్ మాట్లాడుతూ సకాలంలో వ్యాక్సినేషన్ పూర్తి చేయాలన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ మోహన్‌సింగ్, ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ రవీందర్, మాతాశిశు సంరక్షణ ప్రోగ్రాం అధికారి డాక్టర్ అర్చన, ఆయుష్మాన్ ఆరోగ్య ప్రోగ్రాం అధికారి డాక్టర్ విజయ్‌కుమార్, డిప్యూటీ డెమో అనిల్‌కుమార్, డీపీహెచ్‌ఎన్‌ఓ జ్ఞాన సుందరి, డీపీఓ అర్చన, డీడీఎం నితిన్‌రెడ్డి, పీహెచ్‌సీల వైద్యులు, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

22 నుంచి ఆహ్వాన నాటికలు

వర్ధన్నపేట: పట్టణంలోని కళాభవన్‌లో భారతీయ నాటక కళాసమితి ఆధ్వర్యంలో ఈనెల 22 నుంచి 26 వరకు 51వ ఆహ్వాన నాటికల పోటీలు నిర్వహిస్తామని అధ్యక్షుడు అప్సర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలను 22న ఎమ్మెల్యే నాగరాజు, ఎంపీ కావ్య, రాష్ట్ర కో ఆపరేటివ్ ఆపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు ముఖ్యఅతిథులుగా పాల్గొని ప్రారంభిస్తారని పేర్కొన్నారు. 26న శివరాత్రి సందర్భంగా ముగింపు కార్యక్రమం ఉంటుందని, విజేతలకు అతిథులు బహుమతులు అందజేస్తారని వివరించారు.

ఫిర్యాదుల పెట్టెలతో సమస్యల పరిష్కారం

- వసతి గృహాల్లో సత్ఫలితాలు
- వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ సత్యశారద



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ సత్యశారద, అదనపు కలెక్టర్, జిల్లా అధికారులు

వరంగల్: జిల్లాలోని 75 ప్రభుత్వ సంక్షేమ శాఖల గురుకులాలు, వసతి గృహాల్లో విద్యార్థుల డార్మెటరీల్లో ఫిర్యాదుల పెట్టెలను ఏర్పాటు చేయడం వల్ల సమస్యలు పరిష్కారమవుతున్నాయని కలెక్టర్ సత్యశారద.. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి వివరించారు. మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి.. జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో తాగు, సాగునీరు, విద్యుత్ సరఫరా, రైతు భరోసా, రేషన్‌కార్డు దరఖాస్తుల ధ్రువీకరణ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ సత్యశారద కలెక్టరేట్ నుంచి వీసీలో పాల్గొని మాట్లాడుతూ.. వసతి గృహాల్లో ఫిర్యాదుల బాక్స్‌లో ఏర్పాటు చేయడం ద్వారా సత్ఫలితాలు వస్తున్నట్లు పేర్కొన్నారు. దీని ద్వారా విద్యార్థులకు మెరుగైన విద్య, మెనూ ప్రకారం పోషక విలువలతో కూడిన ఆహారం, మౌలిక వసతులు కల్పిస్తున్నారని, గురుకులాల సిబ్బంది అప్రమత్తంగా ఉండి విధులు నిర్వర్తిస్తున్నారని తెలిపారు. దీంతో సీఎస్ శాంతికుమారి అభినందించారు. జిల్లాలో మిషన్ భగీరథలో తాగునీటి సరఫరాకు ఎటువంటి ఇబ్బందులు లేవన్నారు. యాసంగిలో 2,28,000 ఎకరాలు సాగు చే యడం జరిగిందని తెలిపారు. రైతు భరోసాలో 1,63,000 మందికిగాను 91వేల రైతులకు ఖాతాల్లో డబ్బుకు జమ అయినట్లు పేర్కొన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, విద్యుత్ శాఖ ఎస్ఈ మధుసూదన్‌రావు, జిల్లా వ్యవసాయ అధి కారి అనురాధ, జిల్లా పౌరసరఫరాల అధికారి కిష్ట య్య, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

రైతుల సమస్యను మోదీ దృష్టికి తీసుకెళ్తా..

- గ్రీన్‌ఫీల్డ్ హైవే రైతుల గోడు విన్న ఎంపీ ఈటల రాజేందర్



గీసుకొండ: గంగదేవిపల్లిలో రైతులతో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

గీసుకొండ: గ్రీన్‌ఫీల్డ్ హైవేతో భూములు కోల్పోతున్న రైతుల సమస్యలను ప్రధాని మోదీ దృష్టికి తీసుకెళ్తానని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. మంగళవారం రాత్రి 7 గంటల సమయంలో గ్రీన్‌ఫీల్డ్ హైవేతో భూములు కోల్పోతున్న రైతుల సమస్యలను తెలుసుకోవడానికి ఆయన మండలంలోని గంగదేవిపల్లికి వచ్చారు. ఈసందర్భంగా భూములు కోల్పోతున్న రైతులు తమ గోడును ఈటల రాజేందర్‌కు విన్నవించారు. రాష్ట్ర ప్రభుత్వం తమకు అన్యాయం చేస్తోందని, రూ.కోట్లాది విలువైన భూములను మార్కెట్ ధర ప్రకారం కాకుండా తక్కువకు సేకరించడానికి ప్రయత్నాలు చేస్తోందని తెలిపారు. స్పందించిన రాజేందర్ మాట్లాడుతూ.. భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం చేయాలని ప్రధాని మోదీని కోరతానని, రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోతే రైతుల పక్షాన పోరాటం చేయడానికైనా సిద్ధమని భరోసా కల్పించారు. బుధవారం రైతులతో కలిసి మీడియా సమావేశం ఏర్పాటు చేసి రైతులకు న్యాయం చేయాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తానన్నారు. కార్యక్రమంలో భూములు కోల్పోతున్న గంగదేవిపల్లి, గీసుకొండ, ఊకల్, సంగెం, ఆత్మకూరు, నడికూడ మండలాలకు చెందిన రైతులతోపాటు బీజేపీ నాయకులు కాశీ ప్రసాద్, ఎర్రబెల్లి ప్రదీప్, మాజీ సర్పంచ్ కూసం రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

సరోత్తంరెడ్డికి తొలి ప్రాధాన్యత ఓటు వేయాలి

నర్సంపేట: నల్గొండ, వరంగల్, ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా బీజేపీ బలపరిచిన పులి సరోత్తంరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఎంపీ ఈటల రాజేందర్ కోరారు. ఈ మేరకు పట్టణంలో మంగళవారం ఉపాధ్యాయ ఓటర్లను కలిసి ఓటును అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పులి సరోత్తంరెడ్డి ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా మూడున్నర దశాబ్దాలకు పైగా అనుభవం ఉన్న వారని అన్నారు. ఆది నుంచి ఉపాధ్యాయుల సమస్యల గురించి గళం ఎత్తుతూ ఉన్నారని, జీఓ 317వల్ల ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి పోరాడారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, మాజీ ఎంపీ సీతారాంనాయక్, ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, నల్గొండ జిల్లా అధ్యక్షుడు వర్షిత్‌రెడ్డి, నాయకులు కాశీప్రసాద్, నర్సింహారాములు, స్వరూప, మురళి, తిరుపతిరెడ్డి, రాంబాబు, సందీప్ పాల్గొన్నారు.

విద్యార్థి అదృశ్యం.. ప్రత్యక్షం

- విచారణ చేపట్టిన అధికారులు



స్కూల్‌లో విచారణ చేస్తున్న ఎస్సై రఘుపతి

ఖానాపురం: సైనిక్‌స్కూల్‌కు చెందిన ఓ విద్యార్థి అదృశ్యమై ప్రత్యక్షమైన ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. విద్యార్థి తండ్రితోపాటు ఎస్సై రఘుపతి వెల్లడించిన వివరాల ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పడుగోని గ్రామానికి చెందిన సాయివర్ధన్ సైనిక్ స్కూల్‌లో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఈనెల 16న స్నేహితుడి పుట్టినరోజు వేడుకల్లో తోటి విద్యార్థులతో ఘర్షణ చోటుచేసుకుంది. దీంతో రోజంతా డార్మెటరీలో తోటి విద్యార్థులతో మాట్లాడకుండా.. సోమవారం ఉదయం కనిపించకుండా పోయాడు. విషయం తెలుసుకున్న ఉపాధ్యాయులు కుటుంబ సభ్యులు, ఉన్నతాధికారులు, పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై రఘుపతి స్కూల్‌లో విచారణ చేపట్టారు. తండ్రి నారాయణ ద్వారా ఫిర్యాదు స్వీకరించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో స్కూల్ నుంచి అదృశ్యమైన సాయివర్ధన్ ఇల్లందులో ప్రత్యక్షమై బంధువులకు ఫోన్ చేయడంతో వారు ఇంటికి తీసుకెళ్లారు. విద్యార్థి ఆచూకీ లభించడంతో కుటుంబ సభ్యులు, అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. విషయం తెలసుకున్న కలెక్టర్ సత్యశారద.. ఇన్‌చార్జ్ తహసీల్దార్ రాజారేణుక, ఎంపీడీఓ సునీల్‌కుమార్‌లను స్కూల్ వద్దకు పంపించారు. అధికారులు ఫిర్యాదుల పెట్టెను పరిశీలించి వివరాలు సేకరించి వెళ్లిపోయారు. కాగా సైనిక్‌స్కూల్‌లో విద్యార్థుల మధ్య ఘర్షణలు పునరావృతం కాకుండా అధికారులు పటిష్టమైన పర్యవేక్షణ చేపట్టాలని విద్యార్థి సంఘాల బాధ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



బంధువుతో సాయివర్ధన్

సంఘాల లావాదేవీలను నిర్లక్ష్యం చేయొద్దు

- డీఆర్‌డీఏ ఏపీఎం వేణు, ఆడిటర్ వెంకట్

వర్ధన్నపేట: గ్రామైక్య సంఘాల నెలసరి లావాదేవీలను నిర్లక్ష్యం చేయొద్దని డీఆర్‌డీఏ ఏపీఎం వేణు, సీబీఓ ఆడిటర్ వెంకట్ కోరారు. మండల కేంద్రంలోని సెర్ప్ కార్యాలయంలో మండలంలోని ఉప్పరపల్లి, నల్లబెల్లి, కట్ర్యాలతోపాటు సంగెం మండలంలోని వెంకటాపురం, నల్లబెల్లి గ్రామాల గ్రామైక్య సంఘాల రికార్డులను మంగళవారం వారు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వేణు, వెంకట్ మాట్లాడారు. గతేడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు జరిగిన లావాదేవీలకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. సంఘాల లావాదేవీల్లో పొరపాట్లు చోటు చేసుకుంటే వీఓ సహాయకులు (వీఓఏలు), వీఓ ప్రతినిధులు బాధ్యత వహించాల్సి ఉంటుందని చెప్పారు. సంఘాల వసూళ్లు, చెల్లింపులకు సంబంధించిన సరైన ఆధారాలు నమోదు చేయాలని స్పష్టం చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వీఓఏలు, వీఓ ప్రతినిధులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. తనిఖీల్లో వెలుగు చూసిన లోపాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు. తనిఖీలో సీసీలు గోలి కొమురయ్య, స్వామి, స్త్రీనిధి మేనేజర్ కపిల్, వీఓఏ ప్రతినిధి కట్ట రజిత, వీఓఏలు బిర్రు దయాకర్, మంజుల, భిక్షపతి, రాము, రాజా రాణి, ఎంఎస్ అకౌంటెంట్ రేవతి, సీఏ మురళి పాల్గొన్నారు.

పూడికతీత పనులు వేగవంతం చేయండి

- హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య
- అధికారులతో కలిసి భద్రకాళి చెరువు పరిశీలన



భద్రకాళి చెరువును పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య, అధికారులు

నయీంనగర్/హన్మకొండ కల్చరల్: భద్రకాళి చెరువు పూడికతీత పనులు వేగవంతం చేయాలని హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, సంబంధిత అధికారులతో కలిసి మంగళవారం భద్రకాళి చెరువు పూడకతీత పనులను కలెక్టర్ పరిశీలించి మాట్లాడారు. పూడికమట్టిని వాహనాల్లో తరలించడానికి అంతర్గత రోడ్డు నిర్మించాలని సూచించారు. పనులు జరుగుతున్న చోట రాత్రి సమయంలో విద్యుత్ బల్బులు ఏర్పాటుచేయాలని, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడాలని సూచించా. మట్టి తరలించే వాహనాల నమోదు కోసం చెక్‌పోస్ట్ ఏర్పాటుచేసి రెవెన్యూ, పోలీస్, సాగునీటి పారుదల, మున్సిపల్ శాఖల సిబ్బందితో 24 గంటలు పర్యవేక్షణ, తనిఖీ ఉండే విధంగా చూడాలని పేర్కొన్నారు. పూడికమట్టి కావాలనుకునే వారు క్యూబిక్ మీటరుకు రూ.72 చెల్లించి తీసుకోవచ్చని తెలిపారు. కలెక్టర్ వెంట అడిషనల్ కలెక్టర్ వెంకట్‌రెడ్డి, ఆర్డీఓ రాథోడ్ రమేశ్, మున్సిపల్, కుడా, సాగునీటిపారుదల శాఖల అధికారులు ఉన్నారు.

'ఏటీబీ'కి జాతీయస్థాయి గుర్తింపు

- ఎనీటైం బ్యాగును ఆవిష్కరించిన రిషిక్
- రాజ్‌కోట్ యూనివర్సిటీ ప్రొఫెసర్ల ఎదుట ఆన్‌లైన్‌లో ప్రదర్శన



ఆన్‌లైన్‌లో తన ఆవిష్కరణను ప్రొఫెసర్లకు వివరిస్తున్న రిషిక్

దుగ్గొండి : కేంద్ర ప్రభుత్వ ఇన్నోవేషన్ సెల్, విద్యా మంత్రిత్వ శాఖ సంయుక్తంగా ప్రతి ఏడాది స్కూల్ ఇన్నోవేషన్ పోటీలు నిర్వహిస్తోంది. విద్యార్థుల సామర్థ్యాలను గు ర్తించి పరిష్కారాలను రూ పొందించడం..నూతన ఆవిష్కరణలు, సృజనాత్మకత, ఉత్పత్తి వంటి ఆలోచనలను పెంపొందించడానికి స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్ పోటీలను కేంద్ర ప్రభుత్వం చేపడుతోంది.


1.20లక్షల ఆవిష్కరణల్లో 1,200 ఆవిష్కరణలే గుర్తింపు..

దేశ వ్యాప్తంగా ఈ ఏడాది నిర్వహించిన పోటీలకు 1.20లక్షల ఆవిష్కరణలు రాగా 1,200 ఆవిష్కరణలను జాతీయస్థాయి కి ఎంపిక చేశారు. ఇందులో వరంగల్ జిల్లా నుంచి దుగ్గొండి మండలం నాచినపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి రిషిక్ రూపొందించిన ఏటీబీ(ఎనీటైం బ్యాగు) ఆవిష్కరణ ఒక్కటే జాతీయస్థాయికి ఎంపికైంది. ఎన్నికైన ఏటీబీని ఆవిష్కరణను మంగళవారం ఆన్‌లైన్‌లో రాజ్‌కోట్ యూనివర్సిటీ ప్రొఫెసర్ల ఎదుట ప్రదర్శించాడు. ప్లాస్టిక్ వా డకం భారీగా పెరిగిపోయి కాలుష్యానికి దారితీస్తుంది. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా దుస్తువులతో తయారు చేసిన సంచులు (క్లాత్ బ్యాగులు) వాడేటట్లు గైడ్ టీచర్ సుమలత పర్యవేక్షణలో రూపొందిన ఎనీటైం బ్యాగు ఆవిష్కరణను ప్రొఫెసర్లు ప్రశంసించారని హెచ్‌ఎం జ్యోతిలక్ష్మి పేర్కొన్నారు.

ఏటీబీ పనితీరు ఇలా..

ఏటీఎం మిషన్లలో డబ్బులు తీసుకునే విధానాన్ని ప్రాతిపదికగా తీసుకుని రూ.5 నాణెం వేస్తే ఎనీ టైం బ్యాగ్ (దుస్తువులతో తయారు చేసిన సంచి) వచ్చేలా రిషిక్ నూతన ఆవిష్కరణ చేశాడు. మోడల్ పరికరాన్ని అట్ట ముక్కలతో తయారు చేశాడు. మిషన్‌లో 500 వరకు క్లాత్ బ్యాగులను నిల్వ చేయొచ్చు. దీంతో పాటు అందులో ఏర్పాటు చేసిన స్పీకర్ నిత్యం ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలు, క్లాత్ సంచుల వినియోగం వల్ల కలిగే లాభాలు వివరిస్తుంది. కూరగాయల మార్కెట్లు, బస్టాండ్ సెంటర్లలో దీనిని ఏర్పాటు చేస్తే ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని రిషిక్ అంటున్నాడు. ఈ పరికరాన్ని తయారు చేయడానికి రూ.25వేల వరకు ఖర్చు అవుతుందని వివరించాడు. మిషన్ తయారీకి కేంద్ర ఇన్నోవేషన్ సెల్‌కు వివరించగా వారు ఆర్థికసాయం అందిస్తామని చెప్పినట్లు రిషిక్ పేర్కొన్నాడు.

పంటల సర్వే సమర్థవంతంగా చేయండి



సర్వేను పరిశీలిస్తున్న ఏడీఏ దామోదర్‌రెడ్డి

ఖానాపురం: పంటల సర్వేను సమర్థవంతంగా చేపట్టాలని ఏడీఏ దామోదర్‌రెడ్డి కోరారు. మండలంలోని మనుబోతులగడ్డలో సర్వేను మంగళవారం ఆయన పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. వివరాలను యాప్‌లో నమోదు చేయడంలో నిర్లక్ష్యం చేయొద్దని చెప్పారు. పంటల సాగు వివరాలను పక్కాగా నమోదు చేయాలని తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలు, పంట విక్రయాల సమయంలో సర్వే వివరాలు ఉపకరిస్తాయని వివరించారు. అధికారులకు రైతులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఏఓ బోగ శ్రీనివాస్, ఏఈఓలు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల విద్యాశాఖ ఫోరం రాష్ట్ర కార్యవర్గంలో ఉమ్మడి జిల్లా నేతలు

విద్యారణ్యపురి: టీఎస్‌జీఓఎస్ పాఠశాల విద్యాశాఖ ఫోరం రాష్ట్రస్థాయి కార్యవర్గం ఎన్నికలు ఈనెల 17వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించారు. ఇందులో ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలకు పలు పదవులు దక్కాయి. హనుమకొండ జిల్లా విద్యాశాఖలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఫక్రుద్దీన్ అహ్మద్ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికయ్యారు. రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్‌గా భరత్, కోశాధికారిగా జనగామ నుంచి పవన్‌బాబు, కార్యవర్గ సభ్యుడిగా వరంగల్ జిల్లా నుంచి ఎస్‌బీ శ్రీనివాస్, భూపాలపల్లి విద్యాశాఖలో పని చేస్తున్న దిలీప్‌కుమార్ పబ్లిసిటీ సెక్రటరీగా, ప్రశాంత్‌కుమార్ సభ్యుడిగా ఎన్నికయ్యారని బాధ్యులు మంగళవారం తెలిపారు.

సాఫ్ట్‌వేర్ లోపాలతో పత్తి కొనుగోళ్లలో అంతరాయం

- సీసీఐ సీజీఎం పాణిగ్రహి



వరంగల్: రాష్ట్ర మార్కెటింగ్ శాఖకు చెందిన తక్‌పట్టీ సాఫ్ట్‌వేర్‌లో నెలకొన్న లోపాల కారణంగా ఫిబ్రవరి 9వ తేదీ నుంచి పత్తి కొనుగోళ్లలో అంతరాయం కలుగుతోందని కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(సీసీఐ) సీజీఎం(మార్కెటింగ్)ఎస్‌కే.పాణిగ్రహి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం నియమించిన థర్డ్‌పార్టీ డేటా సెంటర్‌లో తీవ్ర నెట్‌వర్క్ అంతరాయంతో ఈ పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. నెట్‌వర్క్ వ్యవస్థ పునరుద్ధరించిన వెంటనే సీసీఐ కేంద్రాల్లో పత్తిని కొనుగోలు చేస్తామని, రాష్ట్రంలో చివరివరకు వచ్చే పత్తిని ఎంఎస్‌పీతో కొనుగోలు చేస్తుందని రైతులకు హామీ ఇస్తున్నట్లు తెలిపారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

- కాపాడబోయిన మహిళకు తప్పిన ప్రాణాపాయం


సోమయ్య (ఫైల్)

దేవరుప్పుల : దండెంపై దుస్తులు ఆరేస్తుండగా విద్యుత్‌షాక్ తగిలి ఓ వ్యక్తి మృతి చెందగా, అతడిని కాపాడబోయే క్రమంలో ఓ మహిళకు ప్రాణాపాయం తప్పింది. ఈ ఘటన మంగళవారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్సై సృజన్‌కుమార్ కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని బీసీ హాస్టల్ ప్రాంతంలో ఉంటున్న నర్ర సోమయ్య(47) ఉదయం స్నానం చేసి దుస్తులు దండెంపై ఆరేస్తున్నాడు. ఈక్రమంలో అతుకులు ఏర్పడిన విద్యుత్ వైరు దండేనికి తగిలింది. దీనిని గమనించని నర్సయ్య దండెన్ని పట్టుకోగా షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. విద్యుత్‌షాక్‌తో విలవిలాడుతున్న సోమయ్యను కాపాడేందుకు వచ్చిన స్థానికురాలు రాధిక.. మీటర్ ఆఫ్ చేసినా విద్యుత్ సరఫరా బంద్ కాలేదు. ఈ క్రమంలో మీటర్ బంద్ చేశానుకున్న ఆ మహిళ.. దండెంపై వైరు తీసే క్రమంలో విద్యుత్‌షాక్ తగలగా అపస్మారక స్థితిలోకి వెళ్లింది. ఇంతలో స్థానికుడు కందుల భిక్షపతి వచ్చి విద్యుత్ మీటర్ ఫ్యూజ్‌లు తీయడంతో రాధికకు ప్రాణాపాయం తప్పింది. ఈ విషయమై సమాచారం అందుకున్న విద్యుత్ అధికారులు ఘటనా స్థలిని పరిశీలించారు. ఈ ఘటనపై మృతుడి కుమారుడు ప్రవీణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఆకు కూరలతో అధిక ఆదాయం..


కొత్తిమీర


పాలకూర


మెంతికూర


తోటకూర

- వేసవిలో తక్కువ సమయంలో ఎక్కువ దిగుబడి, లాభాలు
- మల్యాల కేవీకే ఉద్యాన శాస్త్రవేత్త రాంబాబు
- రైతులకు సలహాలు, సూచనలు



మహబూబాబాద్ రూరల్: వేసవిలో ఆకుకూరల సాగుతో అధిక ఆదాయం పొందొచ్చు. తక్కువ సమయం, తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు అర్జించొచ్చు. ఈ క్రమంలో వేసవిలో ఆకు కూరల్లో ఏ రకం సాగు చేపట్టాలి? ఏ నేలలు అనుకూలం? ఎలా పండించాలనే విషయాలను మహబూబాబాద్ మండలం మల్యాల కృషి విజ్ఞాన కేంద్రం ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ రాంబాబు.. రైతులకు వివరించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

- ఆకు కూరల్లో పాలకూర, తోటకూర, పుదీన, మెంతికూర, గోంగూర, కొత్తిమీర, కరివేపాకు ప్రధానమైనవి.
- ఆకు కూరల్లో లవణాలు, విటమిన్లు, మాంసకృతులు, పీచు పదార్థం ఎక్కువ ఉండడంతో వేసవిలో ఆకు కూరలకు డిమాండ్ ఉంటుంది.
- తక్కువ కాలం, తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం వచ్చే పంట కావడంతో ఆకు కూరల సాగు బహుప్రయోజనకరంగా ఉంటుంది.

ఆకు కూరలసాగుకు నేల తయారీ ముఖ్యం..



- ఆకు కూరలు సాగుచేసే భూమిని నాలుగు, ఐదుసార్లు దున్ని, మట్టి పెల్లలు లేకుండా చూసుకోవాలి.
- ఆఖరి దుక్కిలో ఎకరాకు 10 టన్నుల పశువుల ఎరువు, 300 కిలోల వేప పిండి, 100 కిలోల సూపర్ ఫాస్ఫేట్, 10 కిలోల జింకు సల్ఫేట్, 100 కిలోల ట్రైకోడెర్మా, 20 కిలోల యూరియా, 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌లు వేసి ఆకు, విత్తనాలను విత్తుకోవాలి.

ముఖ్య విషయాలు..

- ఆయా ప్రాంతాలకు అనువైన సాధారణ రకాలు, హైబ్రిడ్ రకాలను వేసుకోవచ్చు.
- తోట కూర విత్తనాలు చిన్నగా ఉంటాయి. అందుకే ఇసుకతో కలిపి చల్లుకోవాలి. ఎకరానికి 800 గ్రాముల విత్తనం సరిపోతుంది.
- పాల కూర విత్తన బంతిలో 2 నుంచి 3 రకాల విత్తనాలు ఉంటాయి. విత్తనాలను మూడు నుంచి నాలుగు సెంటీమీటర్ల లోతులో విత్తుకోవాలి. లోతు ఎక్కువైతే మొలక సరిగా రాదు.
- ధనియాలను (కొత్తిమీర పంట) విత్తే సమయంలో రెండు సాల్లుగా చేయాలి. లేదంటే గింజలు ఆలస్యంగా మొలకెత్తి, మొలక శాతం బాగా తగ్గిపోతుంది. ఇందుకు గింజలను నేలపై పోసి చెప్పులు వేసుకుని కాళ్లతో సున్నితంగా రుద్దాలి. ఎకరానికి నాలుగు నుంచి ఐదు కిలోల విత్తనం సరిపోతుంది.
- కరివేపాకు విత్తనాలను చెట్టుకు ఉండే పండు నుంచి వేరు చేసిన వెంటనే విత్తుకోవాలి. ఆరితే మొలక శాతం తగ్గుతుంది.
- విత్తన శుద్ధికి జీవ శిలీంద్రనాశిని ట్రైకోడెర్మా 8 గ్రాములను కిలో విత్తనానికి పట్టించి విత్తితే వేరుకుళ్లు ఆశించవు.
- విత్తనం విత్తిన 48 గంటల లోపు భూమిలో తేమను చూసి లీటర్ నీటికి 4 మిల్లీ లీటర్ల పెండి మిథాలిన్ కలుపు మందును పిచికారీ చేయొచ్చు.
- పైపాటుగా పంట ఎదుగుదలకు లీటర్ నీటికి 5 గ్రాముల 19:19:19 పాలిఫీడ్‌ను కలిపి పిచికారీ చేయాలి.
- పంటకు అవసరం మేరకు నీరు అందించాలి. నీరు ఎక్కువ అయితే వేరు కుళ్లు, కాండం కుళ్లు వచ్చే అవకాశం ఉంది. స్ప్రింక్లర్ల ద్వారా నీరు అందించడం మంచిది. దీని వల్ల ఆకులపై ఉండే పురుగులు, నల్లులు, దుమ్ము, ధూళి రాలిపోతాయి.

సస్యరక్షణ..

- పేనుబంక, ఆకు ముడత, ఆకులను తినే గొంగళి పురుగులు ముఖ్యంగా ఆశిస్తాయి. వాటి నివారణకు రసాయన మందులను వాడకుండా వేప సంబంధిత మందులు వాడడం మంచిది. రసాయన మందులు వాడితే కనీసం వారం రోజుల తరువాత పంట కోయాలి.
- కత్తిరించే ఆకు కూర పంటలకు, కోత తర్వాత ఎకరాకు 10 కిలోల యూరియా వేస్తే మళ్లీ పంటకు వస్తుంది.
- ఆకులను మార్కెట్‌కు తరలించే సమయంలో గోనె సంచులకు బదులు కట్టలుగా కట్టి గాలి ప్రసరించే ట్రేలలో రవాణా చేయడం మంచిది.

స్వచ్ఛమైన పెట్రోల్ అందిస్తాం


మాట్లాడుతున్న జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా

- వాహనదారులు వినియోగించుకోవాలి
- రాష్ట్ర జైళ్ల శాఖ డీజీ సౌమ్యమిశ్రా
- జైళ్ల శాఖ ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్ ప్రారంభం


వాహనంలో పెట్రోల్ పోస్తున్న సౌమ్య మిశ్రా

ఖిలా వరంగల్: జైళ్ల శాఖ ద్వారా స్వచ్ఛమైన పెట్రోల్, డీజిల్ అందిస్తామని, దీనిని వాహనదారులు వినియోగించుకోవాలని రాష్ట్ర జైళ్ల శాఖ డీజీ (డైరెక్టర్ జనరల్) డాక్టర్ సౌమ్య మిశ్రా అన్నారు. మంగళవారం మామునూరు సెంట్రల్ జైలు ప్రాంగణంలోని తిమ్మాపురం రోడ్డుపై వరంగల్ సెంట్రల్ జైలు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్‌ను జైళ్ల శాఖ వరంగల్ రేంజ్ డీఐజీ ఎం. సంపత్, కలెక్టర్ సత్యశారద, జైలు సూపరింటెండెంట్ కళాసాగర్, జైలర్ పూర్ణచందర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీజీ డాక్టర్ సౌమ్య మిశ్రా మాట్లాడుతూ వాహనదారులకు నాణ్యతతో కూడిన పెట్రోల్, డీజిల్ అందించాలనే లక్ష్యంతో జైళ్ల శాఖ ద్వారా పెట్రోల్ బంక్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంతకు ముందు జైలు సిబ్బంది.. డీజీ సౌమ్య మిశ్రాకు గౌరవ వందనం చేశారు. అనంతరం జైలు ప్రాంగణంలోని రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆ తర్వాత ఖైదీలను కలిశారు. ఈ సందర్భంగా 14 ఏళ్ల శిక్ష పూర్తయిన వారికి క్షమాభిక్ష ప్రసాదించాలని పలువురు ఖైదీలు డీజీని కోరారు.

చిందుబాగోతం.. ప్రాచీన జానపద కళారూపం

- పద్మశ్రీ గడ్డం సమ్మయ్య


కళాకారులను సన్మానిస్తున్న సుధాకర్, సమ్మయ్య

పాలకుర్తి టౌన్ : తెలుగు జానపద కళారూపాల్లో చిందు బాగోతం ప్రముఖమైందని చిందు యక్షగాన కళాకారుడు పద్మశ్రీ గడ్డం సమ్మయ్య అన్నారు. ఇండస్ బుక్ ట్రస్ట్ నిర్వాహకుడు అరూరి సుధాకర్ ఆధ్వర్యంలో రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో మంగళవారం మండల కేంద్రంలోని సుధా టెక్నో స్కూల్ ఆవరణలో యక్షగాన నాటక ఉత్సవాలు కనుల పండువగా నిర్వహించారు. చిందు యక్షగాన పౌరాణిక కథలతోపాటు పలు సామాజిక అంశాలపై చిందు కళాకారులు పద్మశ్రీ గడ్డం సమ్మయ్య, గడ్డం శ్రీనివాస్, గడ్డం సంజీవ, గడ్డం రఘుపతి, సోమరాజు బృందాలు ప్రదర్శనలిచ్చాయి. అనంతరం పద్మశ్రీ గడ్డం సమ్మయ్యతో కలిసి డాక్టర్ సుధాకర్ కళాకారులను సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిందు యక్షగానం పురాణ గాథలను ప్రజలకు చేరవేసే వినోదాత్మక నాటకమన్నారు. శతాబ్దాలుగా చిందు కళాకారులు ఈ కళకు జీవం పోస్తున్నారని తెలిపారు.

సుమతిరెడ్డి మహిళా కళాశాలకు స్వయం ప్రతిపత్తి హోదా

- ఎస్ఆర్ విద్యా సంస్థల చైర్మన్ ఎనగందుల వరదారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న వరదారెడ్డి

హన్మకొండ చౌరస్తా: హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం అనంతసాగర్‌లోని సుమతిరెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాలకు యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ (యూజీసీ), జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ హైదరాబాద్ నుంచి స్వయం ప్రతిపత్తి హోదా లభించిందని ఎస్ఆర్ విద్యా సంస్థల చైర్మన్ ఎనగందుల వరదారెడ్డి తెలిపారు. హనుమకొండ కాకాజీకాలనీలోని ఎస్ఆర్ జూనియర్ కళాశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలోని ముఖ్య నగరాల్లోని కళాశాలలకు దీటుగా సుమతిరెడ్డి కళాశాలలో విద్యార్థినులను అన్ని రంగాల్లో నైపుణ్యం సాధించేలా తీర్చిదిద్దుతున్నామన్నారు. తమ ఇంజనీరింగ్ కళాశాలలో చదువు పూర్తి చేసిన విద్యార్థినులు దేశ, విదేశాల్లోని ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగాలు చేస్తున్నారన్నారు. అటానమస్ హోదాతో తమ కళాశాల కీర్తి మరింత పెరుగుతుందన్నారు. సుమతిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాజశ్రీరెడ్డి మాట్లాడుతూ స్వయంప్రతిపత్తి హోదాతో కళాశాలకు అకడమిక్ మెరుగుదల, సాంకేతిక అభివృద్ధి, కళాశాల అభ్యున్నతి జరుగుతుందన్నారు. విద్యార్థినుల వ్యక్తిగత అభివృద్ధి, సృజనాత్మకతను వెలికితీసి వారిని ప్రపంచ స్థాయిలో ఉద్యోగ, వ్యాపారవేత్తలుగా నిలపడానికి నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా కళాశాల వివిధ విభాగాధిపతులు డాక్టర్ ఇ. సుదర్శన్, డాక్టర్ కె. మహేందర్, డాక్టర్ ఎన్. శ్రీవాణి, ఏఓ వేణుగోపాలస్వామి, అధ్యాపక బృందం, విద్యార్థినుల తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు. అటానమస్ హోదాకు అంకితభావంతో పనిచేసిన ఎస్ఆర్ విద్యా సంస్థల కార్యదర్శి ఎ. మధుకర్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాజశ్రీరెడ్డిని వరదారెడ్డి అభినందించారు.

ప్రశ్నించే నాయకుడిని ఎన్నుకోవాలి

- మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్


మహబూబాబాద్ అర్బన్: మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

మహబూబాబాద్ అర్బన్/మరిపెడ/గూడూరు: చట్టసభల్లో ప్రభుత్వాన్ని ప్రశ్నించే నాయకుడిని ఎన్నుకోవాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. మానుకోటలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వరంగల్, నల్లగొండ, ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలో బీజేపీ అభ్యర్థి పులి సరోత్తంరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఉపాధ్యాయులను కోరారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామనే హామీతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. 14 నెలల పాలనలో హామీలు అమలు చేయక ప్రజలు, ఉద్యోగ, ఉపాధ్యాయులను మోసం చేసిందన్నారు. మాజీ సీఎం కేసీఆర్ 317 జీఓ ద్వారా వేలాది మంది టీచర్ల జీవితాలను ఛిన్నాభిన్నం చేశారన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే సీపీఎస్ రద్దు, 317 జీఓ రద్దు ,6 నెలల్లో కొత్త పీఆర్సీ, డీఏ అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చి మరిచిపోయిందని మండిపడ్డారు. కాగా, బీఆర్ఎస్ నుంచి మాజీ ఎంపీటీసీ సోమ్లా నాయక్, కాంగ్రెస్ నుంచి పల్స రవీందర్‌ను బీజేపీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు వల్లభ వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీ అజ్మీరా సీతా రాంనాయక్, నాయకులు యాప సీతయ్య, భూక్య సంగీత, బాలరాజు, భాస్కర్‌రెడ్డి, రామచందర్‌రావు, సుధీర్‌రెడ్డి, శ్యాంసుందర్‌శర్మ, గోవర్ధన్‌రెడ్డి, సతీశ్, వెంకన్న, మురళి, సురేందర్, మహేశ్, మోతీలాల్, నర్సింహారెడ్డి, అశోక్, సంపత్, సందీప్, అజయ్ పాల్గొన్నారు. అనంతరం మరిపెడ హైస్కూల్, గూడూరు మండలం బ్రాహ్మణపల్లి గ్రామంలోని కస్తూర్బా విద్యాలయంలో సరోత్తం రెడ్డి తరఫున ప్రచారం నిర్వహించారు. మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని ఉపాధ్యాయులను అభ్యర్థించారు. ఆయాపాఠశాల్లో నిర్వహించిన ప్రచారంలో నాయకులు మహేశ్‌గౌడ్, జనార్దన్, రమేశ్, సురేందర్, పార్టీ గూడూరు అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా యువకుడి మృతి

- కరీమాబాద్‌లో ఘటన
- ఆలస్యంగా వెలుగులోకి..

ఖిలా వరంగల్ : అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు మృతిచెందిన సంఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికుల కథనం ప్రకారం.. కరీమాబాద్‌లోని లక్ష్మీనగర్‌కు చెందిన బొల్లు రాకేశ్ (25) హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. స్నేహితుడి పెళ్లి నిమిత్తం శనివారం ఉదయం హైదరాబాద్ నుంచి ఇంటికి చేరుకున్నాడు. సాయంత్రం పెళ్లికి వెళ్లిన రాకేశ్ ఆదివారం ఉదయం విగతజీవిగా కనిపించాడని తల్లి రజిత మిల్స్‌కాలనీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. రాకేశ్ మృతిపై అనుమానాలు ఉన్నాయని, మెడపై గాయాలు ఉన్నాయని స్థానికులు పోలీసులకు సమాచారం అందజేసినట్లు తెలిసింది. పోస్టుమార్టం అనంతరం తల్లి రజితకు సోమవారం సాయంత్రం మృతదేహాన్ని అప్పగించారు. వైద్యుల నివేదిక ఆధారంగా దర్యాప్తు కొనసాగుతుందని, ప్రస్తుతం అనుమానాస్పద కేసుగా నమోదు చేసి విచారణ చేపట్టినట్లు పోలీసులు పేర్కొన్నారు.

భవిష్యత్‌లో మానవ రహిత వ్యవసాయం


- ప్రకృతి వనరులను కాపాడుకోవాలి
- నూతన ఆవిష్కర్తలకు అగ్రి హబ్ దోహదం
- జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ అల్దాస్ జానయ్య


మాట్లాడుతున్న వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ జానయ్య

హన్మకొండ : భవిష్యత్‌లో మానవ రహిత వ్యవసాయ సాగు పద్ధతులు రావొచ్చని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ అల్దాస్ జానయ్య పేర్కొన్నారు. వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో అగ్రి హబ్‌ను నాబార్డు సీజీఎం ఉదయ్‌భాస్కర్, అగ్రికల్చర్ యూనివర్సిటీ వీసీ అల్దాస్ జానయ్య మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జానయ్య మాట్లాడుతూ.. ఇప్పటికే డ్రోన్ల ద్వారా ఎరువులు, పురుగుల మందులు, విత్తనాలు చల్లడం వంటివి చేస్తున్నామని వివరించారు. రాబోయే రోజుల్లో రోబోల సాయం పొందే అవకాశాలున్నాయని తెలిపారు. రోబోలు వస్తే మానవ ప్రమేయం లేకుండా వ్యవసాయ పనులు చేసుకోవచ్చన్నారు. వ్యవసాయం ఎప్పుడూ సంక్షోభంలో చిక్కుకోలేదని, చిక్కుకుంది రైతులు మాత్రమే అని ఉద్ఘాటించారు. వ్యవసాయం సంక్షోభంలో చిక్కుకుంటే కాలగర్భంలో కలిసి పోవాల్సిందేనని వెల్లడించారు. విద్య, వైద్యం ప్రైవేట్ రంగంలోకి రావడంతో రైతులకు ఖర్చులు పెరిగాయని, వ్యవసాయం ద్వారా వచ్చే ఆదాయం మినహా రైతుకు ఇతర ఆదాయం ఉండదని చెప్పారు. చైనాలో వ్యవసాయ పారిశ్రామికీకరణ, గ్రామీణ పారిశ్రామికీకరణ జరిగి దేశం అభివృద్ధి చెందిందని వివరించారు. దేశంలో గ్రామీణ ప్రాంత నూతన ఆవిష్కర్తలను ప్రోత్సహించేందుకు అగ్రి హబ్ ఎంతో దోహదపడుతుందన్నారు. ఈ క్రమంలోనే వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో నాబార్డు సాయంతో అగ్రి హబ్ ఏర్పాటు చేశామని అన్నారు. నాబార్డు చీఫ్ జనరల్ మేనేజర్ ఉదయ్‌భాస్కర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ఆవిష్కర్తలకు అందుబాటులో ఉండేలా వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో అగ్రిహబ్ ఏర్పాటు చేశామన్నారు. వ్యవసాయ రంగానికి పనికి వచ్చే పనిముట్లు తీసుకు రావాలన్నారు. స్వచ్ఛంద సంస్థలు ఈ దిశగా ఔత్సాహికులను గుర్తించి ప్రోత్సహించాలన్నారు. దేశంలో ఏడు ఇంక్యుబేషన్ సెంటర్లు ఉంటే తెలంగాణలో రెండు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలు స్వచ్ఛంద సంస్థలతో పరస్పర అవగాహన ఒప్పందాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పరిశోధన సంచాలకుడు డాక్టర్ బలరాం, అగ్రి హబ్ ఎండీ డాక్టర్ ఆర్.కల్పనా శాస్త్రి, సీఈఓ విజయ్, వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సంచాలకుడు డాక్టర్ ఆర్.ఉమారెడ్డి, వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వెంకటరెడ్డి, జిల్లా వ్యవసాయాధికారులు అనురాధ, రవీందర్ సింగ్, శాస్త్రవేత్తలు, సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

మార్చి చివరి వరకు సాగునీరు విడుదల!

- మరోసారి షెడ్యూల్ ప్రకటించిన 'ఇరిగేషన్'
- వరంగల్ అధికారులకు తాజా ఉత్తర్వులు
- ఎస్సారెస్పీ, దేవాదుల ఆయకట్టుపై ప్రకటన



సాక్షి ప్రతినిధి, వరంగల్ : యాసంగి సీజన్ పంటల సాగుకు నీటి విడుదలపై ఆ శాఖ మరోసారి స్పష్టత ఇచ్చింది. ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల్లో కొన్ని ప్రాంతాల ఆయకట్టుకు సాగునీరు అందడం లేదంటూ రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇదే సమయంలో సాగునీటి విడుదల, ప్రాజెక్టులపై నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించిన సంగతి తెలిసిందే. అయితే 2024, డిసెంబర్‌లోనే యాసంగి పంటలకు సాగునీరు విడుదల షెడ్యూల్ ప్రకటించిన అధికారులు, మంగళవారం ఆన్‌అండ్‌ఆఫ్ పద్ధతిన నీరు విడుదల చేయనున్నట్లు మరోసారి స్పష్టం చేశారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు (ఎస్సారెస్పీ) స్టేజ్–1లో 7,99,470 ఎకరాల ఆయకట్టుకు యాసంగిలో నీరందించడం లక్ష్యం కాగా.. పాత ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్ జిల్లాల ఆయకట్టుకు ఈ నీరందనుంది. ఎస్సారెస్పీ స్టేజ్–2లో వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల్లో స్థిరీకరించిన 3,36,630 ఎకరాలకు సాగునీరు విడుదల అవుతోంది. జె.చొక్కారావు గోదావరి ఎత్తిపోతల (దేవాదుల) పథకం ద్వారా 1,73,153 ఎకరాల ఆయకట్టుకు నీటి సరఫరా చేయడం ఇరిగేషన్ లక్ష్యం కాగా.. పాకాల, రామప్ప, లక్నవరం సరస్సులు, మల్లూరు ప్రాజెక్టుల కింద మరో 24 ఎకరాల ఆయకట్టు ఉంది. మొత్తం ప్రాజెక్టుల ద్వారా ఉమ్మడి వరంగల్‌లోని వరంగల్ పశ్చిమ, తూర్పు, పరకాల, నర్సంపేట, స్టేషన్‌ఘన్‌పూర్, జనగామ, వర్ధన్నపేట, పాలకుర్తి, డోర్నకల్, మహబూబాబాద్ నియోజక వర్గాలకు చెందిన సుమారు 3.31 లక్షల ఎకరాల్లో సాగు చేసిన ఈ యాసంగి పంటలకు నీరందుతుందని అధికారులు ప్రకటించారు. నీటి విడుదల మార్చి చివరి వరకు కొనసాగుతుందని స్పష్టం చేశారు. 'శివం' సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు యాసంగి పంటలకు ఆన్‌అండ్‌ఆఫ్ పద్ధతిలో నీరందించడం జరుగుతుందని, ఎవరూ ఆందోళన చెందవద్దని ఇరిగేషన్ ఈఎన్‌సీ జి.అనిల్‌కుమార్ పేర్కొన్నారు. అలాగే జంగిల్ క్లియరెన్స్, మెయిన్ కెనాల్స్, డిస్ట్రిబ్యూటరీలు, తనిఖీల కోసం సేకరించిన కాల్వ వెడల్పులను సక్రమంగా నిర్వహించాలని, నీటి నియంత్రణ, విడుదల చేయడానికి ముందు అన్ని కీలకమైన ఆపరేషన్, మెంటనెన్స్ పనులకు హాజరు కావాలని ఆయన అధికారులను ఆదేశించారు. అన్ని కెనాల్ బ్యాంకింగ్ రీచ్‌లను నిశితంగా పరిశీలించాలని ఈఎన్‌సీలు, సీఈలకు సూచించారు. సీఎం ఆదేశాల మేరకు నీటి విడుదల జరుగుతుందని, కీలక సమయంలో సరిగ్గా నీటి వినియోగం జరగడానికి ఈఈలు రాత్రివేళ పెట్రోలింగ్ నిర్వహించాలని ఈఎన్‌సీ అనిల్ ఆదేశించారు.

వైద్యపరీక్షలకు వెళ్లి వచ్చేలోగా..

- తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ
- 10.50 తులాల బంగారు, 30 తులాల వెండి ఆభరణాలు, రూ.88 వేల నగదు అపహరణ
- మహబూబాబాద్‌లో ఘటన


దొంగలు పగుల గొట్టిన బీరువా

మహబూబాబాద్ రూరల్ : వైద్య పరీక్షల నిమిత్తం ఆస్పత్రికి వెళ్లి వచ్చేలోగా ఓ ఇంట్లో చోరీ జరిగింది. ఈ ఘటనలో 10.50 తులాల బంగారు, 30 తులాల వెండి ఆభరణాలు, రూ.88 వేల నగదు అపహరణకు గురైంది. మహబూబాబాద్‌లో జరిగిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని సుందరయ్య నగర్ కాలనీలో నివాసముండే మహబూబ్ అలీకి ఆరోగ్యం బాగాలేకపోవడంతో వైద్య పరీక్షల నిమిత్తం ఈ నెల 10వ తేదీన హైదరాబాద్ వెళ్లారు. తిరిగి కుటుంబ సభ్యులు ఈ నెల 17వ తేదీన సాయంత్రం ఇంటికి వచ్చేసరికి తలుపు తాళం పగులగొట్టి ఉంది. దీంతో అనుమానంతో ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తలుపులు తొలగించి ఉన్నాయి. అందులోని 10.50 తులాల బంగారు, 30 తులాల వెండి ఆభరణాలు, రూ.88 వేల నగదు కనిపించలేదు. దీంతో చోరీ జరిగిందని భావించిన మహబూబ్ అలీ, అలీమాబీ దంపతులు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. టౌన్ ఎస్సై శివ ఘటనా స్థలిని పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాల ఉత్పత్తిలో భారత్ మొదటిస్థానం

- కేవీకే కోఆర్డినేటర్ రాజన్న


సోలార్ విద్యుత్ ఉత్పత్తిపై అవగాహన కల్పిస్తున్న కేవీకే శాస్త్రవేత్త రాజు

మామునూరు : పాల ఉత్పత్తిలో ప్రపంచంలో భారత్ మొదటి స్థానంలో ఉందని కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ రాజన్న పేర్కొన్నారు. మంగళవారం మామునూరు కృషి విజ్ఞాన కేంద్రంలో గృహ, విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ అరుణాజ్యోతి, సౌమ్య ఆధ్వర్యంలో విలువ ఆధారిత పాల ఉత్పత్తులపై శిక్షణ నిర్వహించగా రాజన్న ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పాల ఉత్పత్తులను కుటీర పరిశ్రమగా ఏర్పాటు చేసుకుని అధిక లాభాలను పొందవచ్చని సూచించారు. పాల ఉత్పత్తి, ఆదాయ మార్గాలపై డాక్టర్ అరుణాజ్యోతి రైతులకు అవగాహన కల్పించారు.

కేవీకేను సందర్శించిన విద్యార్థులు

మామునూరు కృషి విజ్ఞాన కేంద్రాన్ని నర్సంపేట, దుగ్గొండి హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు ఎడ్యుకేషనల్ విజిట్ టూర్‌లో భాగంగా మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కేవీకే అందించే సేవలు, చేపల పెంపకం, వర్మి కంపోస్ట్ తయారీ, ప్లాస్టిక్ మల్చింగ్ పద్ధతిలో కూరగాయల సాగు, అజోల్లా ఉపయోగాలు, సోలార్ వినియోగం, పెరటి కోళ్ల పెంపకం, వ్యవసాయ పనిముట్ల ఉపయోగాలపై శాస్త్రవేత్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ రాజన్న, సౌమ్య, రాజు, అరుణాజ్యోతి, గణేశ్, సాయికిరణ్, సాయిచంద్, శుశ్రుత్ పాల్గొన్నారు.

తల్లి చెంతకు ఆడశిశువు..

- అప్పగించిన అధికారులు


తల్లికి శిశువును అప్పగిస్తున్న అధికారులు

చెన్నారావుపేట: విక్రయానికి గురైన ఆడ శిశువు తల్లి చెంతకు చేరింది. చెన్నారావుపేట మండలం బాపునగర్ గ్రామానికి చెందిన ఓ కుటుంబం ఆడ శిశువు జన్మించిన కొద్దిరోజులకు విక్రయించింది. ఈ ఘటనపై ఈ నెల 16వ తేదీన 'ఆడ శిశువు అమ్మకం' అనే శీర్షికతో 'సాక్షి' కథనం ప్రచురించింది. ఈ కథనంపై స్పందించిన చైల్డ్ వెల్ఫేర్ జిల్లా కమిటీ చైర్‌పర్సన్ వసుధ ఆధ్వర్యంలో పూర్తి స్థాయిలో విచారణ చేపట్టారు. అనంతరం గ్రామ పెద్దల సమక్షంలో తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించగా తన అనారోగ్య కారణంగా శిశువును బంధువుల ఇంటి వద్ద ఉంచినట్లు తల్లి తెలిపింది. అధికారులు వెంటనే బంధువులకు సమాచారం ఇచ్చారు. దీంతో మంగళవారం వారు శిశువును తీసుకుని రాగా అధికారులు శిశువును తల్లిదండ్రులకు అప్పగించారు. మరోసారి శిశువును విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు మధు, సుజాత, రామలీల, షాహెద, మేగ్య, తదితరులు ఉన్నారు.